# 12. రామ రాజ్యం

రాజు అసలు పేరు సీతారామరాజు. సీతారామరాజు దేశాన్నేదో ఉద్ధరించాడనీ, ఆ పేరు పెట్టుకోబోతున్న ఆ పుట్టుగుడ్డుకూడా దేశాన్ని ఏదో చేసి ఉద్ధరింపక పోతాడా అనే ఆశతో ఆ కళ్లు తెరవని గుడ్డుమీద కొండంత ఆశతో సీతారామరాజు అనే పేరుపెట్టారు. ఆ గుడ్డుకన్న తల్లి దండ్రులు, అనుకున్నట్టుగా ఉద్ధరించాడు — పాతికేళ్ళ తర్వాత ఇంజనీరు కోర్సును పుక్కిటపట్టి, కాగితాలమీద కక్కినందుకు — బాగా కక్కాడంటూ — ఓ పెద్ద కాగితం నాలుగుపక్కలా నలుపు బోర్డర్లతో రాజుకు యిచ్చారు.

"రాజు — ఇంజనీర్ —" బాగుందనే అనుకున్నాడు ది గ్రేట్ రాజు.

ఇంజనీరైన రాజుకు, తలిదండ్రులు ఏమీ తీసిపోలేదు. రాజు సివిల్ ఇంజినీర్ అవునో కాదోగానీ, రాజు తలిదండ్రులు మాత్రం కాను. వాళ్ళెన్నో కోటలు, మేడలు, వంతెనలూ—

ఉండటానికో పెద్ద భవంతి—

కూతురు పెళ్లికో అంతస్థు గోడ—

పేదరికం నుంచి దాటిపోవటానికో వంతెన.

అయితే అన్నిటికీ పునాది — నల్లబోర్డర్ చదరపు కాగితం, ఇండియన్ ఇంకుతో అందమైన అక్షరాలు.

ఆ కాగితాలు, ఆ అక్షరాలు అన్నం పెడతాయని ఆశ ఆ తల్లి దండ్రులకు—

అన్న ఎంతో కష్టపడి తెచ్చుకొన్న డిగ్రీ తన మెళ్లోకి మాంగల్యం తేదా అనే ఆశ ఆ చెల్లెలుకు.

ఇంత పెద్ద కాగితానికో ఉద్యోగం రాదా అనే ఆశ రాజుకు.

—ఇవన్నీ ఉండేవి నాలుగేళ్ళ క్రితం !

ఇవేళ –

ఇవేళ –

ఆ కాగితాలు అన్నం పెట్టలేవని ఆ తలిదండ్రులకు తెలిసిపోయింది.

ఆ కాగితం తాళి తేలేదనీ, అధవా తెచ్చే కాలం వచ్చినా, తాను సజీవంగా వుండననే సంగతి ఆ చెల్లెలుకూ తెలుసు.

కాని రాజుకు మాత్రం అంత పెద్ద కాగితం ఓ చిన్నది –

చిన్నదంటే చిన్నది,– ఉద్యోగం రాదా అనే ఆశ మాత్రం ఇంకా చావలేదు.

అందుకే పొద్దున్నే రాజు స్నేహితుడి దగ్గరకు వెళ్ళొచ్చాడు— "రేపు కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్వ్యూ.... కొంత సాయం...."

ధనసాయం కాదు కావాల్సింది పలుకుబడి !

ఉపయోగిస్తానన్నాడు ఆ హితుడు, వెంకట్రావు.... "మా నాన్నతో చెబితే...."

పని అంతా అయిపోతుంది అనుకున్నాడు రాజు.

రాజు చెల్లెలు రాగిణి అలాగే అనుకొంది.

"ఈ వేళ రాత్రి ఎలాగో గడుపుకుందాంరా అన్నయ్యా ! రేపునీ చేతికి ఆర్డరొస్తే ...."—ఆ?

అయినా ఈ రాత్రి ఎలా గడపాలి ?

అమ్మకు మందులు అయిపోయి ఈ వేళకు వారం రోజులు....

అన్నట్లు రేపు నాన్నకు వార్షికం-తద్దినం-

"నాన్నదీ నాదీ రేపే పెట్టేస్తే సరి... "అందామనుకున్నాడు. తెలీ ఉండానే అనేశాడు.

"తప్పురా, అలా అనకూడదు-"రాగిణి అదిలించింది.

ఏది తప్పు? నాన్న చేసింది తప్పా? తను చేస్తానన్నది తప్పా ?- పెళ్ళి చేసుకొని కొడుకును ఇంజనీరుగా చూసుకోవాలనుకోవడం తప్పా ? చేసింది గుమాస్తా గిరిఅయినా,సాయంత్రాలు ట్యూషన్లు చెప్పి, తన్ను ఆ మూల 'రాజుగ' నడిపేందుకు, నెలకోసారి తన శరీరాన్ని అణువణువుగ కోసి పోస్టులో పంపటం తప్పా? కొడుకు చేతికి డిగ్రీ రాగానే బతికాం అనుకోవడం తప్పా ?

కాదు కాదు-ఇవన్నీ క్షమించేయచ్చు. చిన్న తప్పులు!

కానీ—

చదవటం పూర్తవగానే కొడుక్కు- ఉద్యోగం కోరుకోవటం- రాజు తండ్రిచేసిన తప్పు, క్షమించరానిది.

అతను చదవటం పూర్తయి ఇంకా ఓ అయిదేళ్ళయినా కాలేదు, మరి ప్రణాళికలో అతనికో ఉద్యోగం ఉండమంటే ఎలా ఉంటుంది ? ఉండదు.

ఈ మిడిల్‌క్లాస్ పీపుల్‌కు బుర్రల్లేవు. ప్లానింగు ఉండదు, కనీ కనగానే ఉద్యోగం అంటే ఎలా ? రాదు. అయినా, ఇంతగా పురోభి వృద్ధి చెందిన దేశంలోనే యిలా అయితే, ఇంకా ఆఫ్రికాలో అయితేనా....?—అవును, వీళ్ళంతా ఇక్కడ పుట్టవలసిన వాళ్ళు కాదు, వీళ్ళకు ఇక్కడ బ్రతికే అర్హత లేదు. వీళ్ళు జంతువులు. ఎంత కృషి!- ఎంతకృషి చేస్తున్నాం ? ఎన్నిఫ్యాక్టరీలు, ఎన్ని ప్రణాళికలు కట్టటం లేదు! ఎన్ని వంతెనలు ఎన్ని ప్రాజెక్టులు ... నో నో, ఇలా అయితే

లాభం లేదు. ప్రోగ్రెసివ్ థింకింగ్ రావాలి. లేకపోతే దేశం ఏమవు టట్లు ??—దేశమంటే మనుషులు, మట్టికాదుట! మనం మర్చిపోతే ఎలా? బతికొన్న మనుషులకి తద్దినం పెట్టడమా ? తప్పు. తప్పు—

మీ కోరికలకు గోరీలు కట్టండి.

మీ ఆశల్ని సమాధి చెయ్యండి.

మీ ఆశయాల్ని అడుగంటా నాశనం చెయ్యండి—అంతే గాని ఇలాఅయితే లాభం లేదు.

"అన్నయ్యా, డొక్కలో నొప్పిగా ఉంది!-" ఇంకా కళ్లైనా తెర వని గుడ్డు. వీడొకడు ప్రాణానికి! డొక్కలో నొప్పిట!! డొక్కలో నొప్పిరాక ఇంకేమొస్తుందిరా నీకు ?—ఒరే రాస్కెల్ కూర్చుని చద వరా—వద్దొద్దు చదవకు, తల చెడిపోతుంది, నువ్వు పెద్దవాడివై పోతావ్ ఉద్యోగం కావాలంటావ్, ఇల్లు కావాలంటావ్, నీడ కావాలంటావ్.

ఉహూ చదవకు !!

పోయి రిక్షా లాక్కో ! ఓ పావలా వస్తుంది.

లేకపోతే, గిన్నెలు కడుక్కోరా !?-రూపాయొస్తుంది.

అది చేత కాకపోతే, అదిగో, ఆ మూల ఆ వెలుగుతున్న చీకట్ల మధ్య పడుచుల అడతనాన్ని అమ్ముకోరా—మిద్దెలుకట్టొచ్చు—

లేకపోతే ఏదైనా చెయ్-కానీ చదవకు-చదవద్దొంటే చదవొద్దు !

'రేపు పొద్దున డాక్టరుగారి దగ్గరికెళ్లి ....

—ఆ తెల్లారిపోయింది తెల్లవారే సరికి.

రాజుభయంగా ఇంటర్వ్యూకు వెళ్ళాడు. అయిదేళ్ళ చదువునుఅయిదు నిమిషాలపాటు మానభంగం చేశారు. నీ పొట్ట కోస్తే అక్షర ముక్క లేదు పొమ్మన్నారు.

ఆ సంగతే, ఆర్రోజుల తర్వాత– 'వియ్ రిగ్రేట్ టు.... అంటూ తెలియజేశారు.

ఈ ఆర్రోజులూ....

రాగిణి పగలు పస్తు లే ఉందో, రాత్రిళ్ళు ఉపవాసం ఉందో.

రాజు తమ్ముడు రిక్షాలే తొక్కాడో, గిన్నెలే కడిగాడో.

రాజు అమ్మ ఆశల అగరొత్తుల గంధం ఆస్వాదిస్తూనే ఆవలించిందో, లేదో ఆకలి తీర్చుకొందో లేదో—ఆ ఇంటర్వ్యూ బోర్డు వారికే తెలీదు.

కానీ రాజుకు తెలుసు, రాగిణికి తెలుసు, ఆయింటి మీద వీచిన గాలికి తెలుసు

ఆ ఇంట్లో రాజ్యం చేసిన చీకట్లకు తెలుసు.

ఇంటర్వ్యూ రోజున బోర్డందరికీ తెలుసు—కానీ వాళ్ళేం చేస్తారు: పై నుంచి ప్రెషరొచ్చిందట!

రాజు ఇంజనీరు. పై నుంచి వచ్చే ప్రెషర్ కిందెలా పనిచేస్తుంది అని అడగలేకపోయాడు, స్నేహితుడు వెంట్రావును!

అందుకే బిక్కచచ్చిపోయాడు – ఇంటర్వ్యూలో వెంకట్రావుని కాదని వెంకట్రెడ్డిని తీసుకొన్నారని చెబితే!!

"మనకా అదృష్టం లేకపోయిందిరా–" అంది రాగిణి.

ఏడుద్దామనుకొన్నాడు రాజు, కన్నీళ్ళకు కూడా కన్నీళ్ళు రాలేదు. ఆ కన్నీళ్ళకెట్నుంచీ ప్రెషర్ లేకపోయిందిమరి!

"లే, రేపు పొద్దున్నకు కూడా"

"నాకు కళ్ళు తిరుగుతున్నాయిరా"

నోరెత్తి చెప్పనిదీ, అడుగనిదీ అమ్మే! క్షణానికోసారి దగ్గుతూ నరకం పంచుతోంది. అమ్మ దగ్గుతోంటే రాజుతో బాటుగ గూట్లోని సీసాలు కూడా నిస్సహాయంగా నిలబడిపోయాయి.

పెట్టెలో ఓ రూపాయైనా, ఓ అర్థయినా ఆఖరికి ఒకణా అయినా- అణాకో పెప్స బిళ్ళ ఇస్తారో ఇవ్వరో ?-

పెట్టె తలుపు తీయగానే సర్టిఫికేట్లు ...'పాస్డ్ ఇన్ ఫస్ట్‌క్లాస్....

రాగిణి అంది- అన్నయ్యా దీన్ని ఫొటో కట్టిద్దాంరా!"అని. తన జీవితాన్ని మాత్రం ఫొటో కట్టించింది ఈ కాగితం. మనిషికి లేని విలువ కాగితాలకు ?

అర్థ రూపాయి కాదు, అరనయాపైసా అయినా దొరకలేదురాజుకు. పెట్టె అంతా గాలించాడు. సెర్చి వారంట్ లేకుండానే ఇల్లుసోదా చేస్తున్న పోలీసులవంక భూస్వామి చూసే చూపుతో చూస్తోంది ఆ సర్టిఫికెట్.

నల్లరంగు బార్డర్, నల్ల ఇంకు అక్షరాల తెల్ల కాగితం.

ఆ కాగితం బ్లాక్ మనీ కాదు. సర్టిఫికెట్ ఇన్ బ్లాకు అండు వైట్ అయినా పనికిరాదు.

'వెంకట్రావ్ ప్లీజ్....ఓ అయిదు రూపాయలు ...' గుండె ఆగి పోయింది రాజుకు. అడిగింది అయిదురూపాయలా ? అబ్బ - అంతెందుకు ఇస్తాడో. యివ్వడో....

'ప్లీజ్, నీ యిష్టం ఎంతైనా సరే....'

"ఓ అణా యివ్వనా ? "జోకేశాడు వెంకట్రావు.

"మహాప్రసాదం" అందామనుకొన్నాడు. అనలేదు. ఆ మాటలు కళ్ళు అనేశాయి. అయినా రాజుకు వెంకట్రావు అణా యివ్వలేదు. అయిదు రూపాయలు యిచ్చాడు.

"నీ విషయంలో హెల్ప్ చేయలేకపోయా గానీ రాజూ....ఫలానా కంపెనీలో క్లర్కు పోస్ట్ ఖాళీగాఉందిట...."

"మరికొంచెం సాయంజేస్తే, చచ్చి నీ కడుపున...." ఛీ ఛీ కడుపునా?బావను.

కానీ రాజూ, నువ్వు హైలీ క్వాలిఫైడ్‌రా, లాభంలేదు అందుకని

"అందుకని నాకురాదు, మరేం లాభం...."

'ఓ పనిచెయ్యి - మధ్యాహ్నం ఒ సారి మినిస్టర్నిపంపు బాస్‌తో మాట్లాడి, ఏ మాత్రం వీలున్నా...."

రాజుకు పండుగ అయింది ఆ రోజు.

"నువ్వురారా!"అంది రాగిణి.

నీరసంగాఉండి కదల్లేను అనలేక పోయాడు రాజు. ఫర్వాలేదు, వెళ్ళమన్నాడు వెంకట్రావు. అడిగిన వాటికి సవినయంగా సరిగాసమాధానం చెప్పమన్నాడు.

కొంతకాలం పెరిగి, ఇప్పుడు ఇక పెరగమని ఆగిపోయిన యౌవనాన్ని దాచలేక అవస్థపడుతోంది రాగిణి. ఒంటిపైన వెలిసిపోయిన వోణి, ఆ వోణి లోపలి మనసులోని కోర్కెలుమాత్రం యింకా వెలిసిపోలేదు.

అందుకే అలసటగ, నీరసంగ అడుగులుపడుతున్నా, ఆనందంగ అడుగులు వేస్తున్న చెల్లి వెనుక వెడదాం అనుకొని, బరువుగ వాలుతున్న కళ్ళు వద్దంటే ఆగిపోయాడు రాజు.

"దానికా ఉద్యోగం వస్తే ...."

ఏడుకొండలూ నడిచి వస్తానంది అమ్మ. అమ్మకు తెలీదేమో నడిచే రోజులు లేవు. పాకే రోజులు యివి.

ఈ దేశంలో రెండే రకాల మనుషులు-పాకేవాళ్ళు, పాలించేవాళ్ళు.

"రాజుకో ఉద్యోగం వస్తే .... తల నీలాలు యిస్తానందో రోజు అమ్మ. దేవుడి కా బొచ్చు అక్కర్లేక పోయింది. తైల సంస్కారం లేనిది విగ్గులకు పనికిరాదేమో"

పోవద్దూ, ఈ రోజుతో కష్టాలు గట్టెక్కాయి అనుకొన్నదో రోజు.

అన్నయ్య నోచుకోని ఉద్యోగం అక్కయ్యకు వస్తే తనేం చేయాలో, ఆశల అంతస్థులో నిలబడి ఆలోచిస్తున్నాడు రాజు తమ్ముడు. చీకటి పడుతున్నా కూతురింటికి రాలేదేమా అనే ఆలోచించింది అమ్మ. వెళ్ళొకసారి చూసి రారా అంది. యిష్టం లేకపోయినా కదిలాడు ఆ ఫలానా కంపెనీకి.

ఆ కంపెనీ, మొగుడు చచ్చిన ముండలా కళావిహీనంగా వుంది.

పదవిపోయిన పెద్ద మనిషి ఇల్లులా నిర్మానుష్యంగా ఉంది.

గూర్ఖా అడ్డొచ్చాడు, ఎక్కడికంటూ.

చెప్పాడు.

వాడు బూతులు తిడుతూ అన్నాడు, రాత్రి వేళ ఎవరూ ఉండరని. సగం చచ్చి అడిగాడు రాజు, 'నా చెల్లెలొచ్చింది యిటు—'అని.

"అలా చెప్పు మరి! చెల్లెలా ఆమె? అయినా ఇపుడొస్తే ఎలా? రాత్రొచ్చి రమ్మంటే ఏ చెల్లెలైనా ఎలా వస్తుంది' వాడన్న మాటలన్నిటికీ ఇదే అర్థం. అంతా అయాక గెస్టుహౌసుకు పొమ్మన్నాడు.

అక్కడ రాజు అనుకొన్నట్లుగ కేకలు లేవు, పెడబొబ్బలు లేవు, గోలలేదు, గగ్గోలులేదు.

లోపలంతా లైట్లు వెలుగుతున్నాయి.

మనసుల్లోని చీకట్లు బయటకు కనిపిస్తూనే ఉన్నాయి.

మసక వెలుతుర్లో మనుషులున్నారు.

రాజు గుండెల్లో దయ్యాలున్నాయి.

"ఇలా జరగకూడదు" అనుకొన్నాడు. అడ్డంగ తల ఊపుతూ అక్కడే నిలబడితే గూర్ఖా బయటకు నెట్టేశాడు. ఆ తూలడంలో కింద పడితే కాఫీ తాగమని పావలా యిచ్చాడు గూర్ఖా జాలిపడి. రాజు కదిలాడు.

మర్నాడు—

నిన్న చీకటి తెరలు రంగు మార్చుకొంటున్నపుడు.

తూరుపు దిక్కున ఎర్రని సూర్యుడు తల ఎత్తుతున్నపుడు,
రాగిణి యింటి కొచ్చేసింది. ఇంట్లో కొచ్చేసరికి,
అమ్మ అయాసంతో దగ్గటం లేదు.
తమ్ముడి కళ్ళు తిరగటం లేదు.

ఇంజనీర్ రాజు నేలమీద నిలబడి లేడు. ఇంటి దూలానికీ, తన మెడకూ తాడుతో వంతెన కట్టాడు. రాగిణికి కళ్ళు చెదరిపోయాయి.

అయినా,

ఎలుకల మందు పాకెట్‌కు రాజుకు డబ్బులెక్కడనుంచి వచ్చిందో రాగిణికి అర్థం కాలేదు. ఆ పాకెట్‌లో న్యాయంగ తనకు రావాల్సిన వాటాని తనకివ్వకుండానే ఖాళీ చేసేసినందుకు తనకుటుంబమంటే రాగిణికి చెప్పలేనంత అసహ్యమొచ్చింది. ఒకే కుటుంబంలో యింత దౌర్జన్య మయితే, దేశం ఏమయిపోతుందా రాగిణి ఆలోచించినా కూడా ఆమెకు అర్థం కాలేదు.

బతకడానికెన్నో మార్గాలు, ఫ్యాక్టరీలు, ప్రాజెక్టులు ఉన్నా, మనుషులెందుకు చస్తారో వెంకట్రావుకు బోధపడలేదు.

ప్రభుత్వం రామరాజ్య స్థాపనకై ఎంతో కృషి చేస్తోన్నా, యువకులు ఎందుకు కాదంటున్నారో పేపరు చదివిన పేరయ్యకూ తెలియలేదు.

మరి మీకో ? ? ..

[ఆంధ్రజ్యోతి 2-6-'72]